*Athaluri Vijayalakshmi was born an brought up in Andhra Pradesh and has the tremendous contributions to the writers world in Telugu. She is very popular for her writings in Radio Shows and Books. Her writing are also taken up to the silver screen for comic movies in Big Telugu movies and small screen plays and stage plays.*





# అమావాస్య తార

# అమావాస్య తార

అత్తలూరి విజయలక్ష్మి

# అమావాస్య తార

తెల్లవారింది...

మహానగరాల్లో ఒకటైన చెన్నై నగరం....ఒక్కసారిగా ఉలిక్కిపడింది... ప్రతి ఇంటి గుమ్మం ముందూ ఆ ఇంట్లోని వారిలో ఒకళ్లు నిలబడి న్యూస్‌పేపర్ కుర్రవాళ్లకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు.....నిద్రలేస్తూనే వినిపించిన దుర్వార్తతాలూకు వార్తా వివరాలు చదవడానికి. కానీ, ఆ దుర్వార్త ఇంకా ప్రెస్సుని చేరలేదు ..అందుకే పేపర్‌లో రాలేదు. అయితే, ఎక్కడినుంచి వచ్చిందో క్షణాల్లో దావానలంలా వ్యాపించింది.. సుప్రసిద్ధ కథానాయికి శ్రేయ మరణించింది... ఆ వార్త తెలుసుకున్న చెన్నైనగరవాసుల మొహాల్లో ఆశ్చర్యంతో కూడిన విషాదం నిండిపోయి ఉంది.... పాపం ఎంత ఘోరం జరిగింది! ఇదెలా జరిగింది? అందరి మనసుల్లోనూ ఇదే భావం

చిన్నపిల్ల ...ఎంత బాగా నటించేది? పాత్ర అర్థం చేసుకుని ఆ పాత్రలో జీవించేది...స్వల్పకాలంలో నంబర్‌వన్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న తార ఎందుకు చచ్చిపోయింది? ఆత్మహత్యా...ఈ మధ్య ప్రేమవిఫలమై కొందరు హీరోయిన్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు... ఈ మెకూడా ఆ పరంపరలోనే చనిపోయిందా? ఇలా అందరూ తర్జనభర్జనలు పడుతుండగా.....

టి నగర్‌లోని అందమైన ఓ భవంతిముందు పోలీసు జీపు ఆగింది... బూట్లు టకటకలాడించుకుంటూ ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుల్స్ లోపలికి నడిచారు... వాళ్ల వెనకాలే ఫింగర్‌ప్రింట్స్ నిపుణుల బృందం ..... హటాత్తుగా ఆ భవంతిలోంచి ఏడుపులు వినిపించాయి... మాటలు, పోలీసుల బూట్లశబ్దం ... మరికొన్ని శబ్దాలు..... శ్రేయ శవాన్ని హాల్లో పడుకోబెట్టారు... శవం చుట్టూ ఆ ఇంట్లో పనిచేసేవాళ్లు అంతా గుమికూడి గట్టిగా కొందరు, నిశ్శబ్దంగా కొందరు ఏడుస్తున్నారు... పోలీసులు వాళ్లని దూరంగా పంపించేశారు... పోలీసులతోపాటు వచ్చిన డాక్టర్ శవాన్ని పరీక్షించాడు..

డాక్టర్ పరీక్షచేస్తుంటే అందరూ ఊపిరి బిగపట్టి టెన్షన్‌తో చూడసాగారు..

డాక్టర్ పరీక్షించడం ముగించాడు... కళ్లద్దాలు తీసి, కళ్లు తుడుచుకుంటూ ఇన్‌స్పెక్టర్‌వెప్పు చూశాడు..

“ఏం జరిగిఉంటుంది డాక్టర్? ఏటాకా? “

డాక్టర్ ఆయనవెప్పు చూశాడు..తనవెపే ఆతృతగా, అనుమానంగా చూస్తున్నాడు.“ నో ఇన్‌స్పెక్టర్! ఇది సహజ మరణం కాదు.‘

ఉలిక్కిపడ్డాడు ఇన్‌స్పెక్టర్...“.యూ మీన్....“

“హత్యచేయబడినట్టు అనుమానంగా ఉంది..“

“ మర్డరా? “ చప్పున జేబులోంచి కర్చీఫ్ తీసి, మొహం తుడుచుకున్నాడు..

“యస్!“ డాక్టర్ నమ్మకంగా, ధృఢంగా అన్నాడు...

“ఎలా?“ అడిగాడు ఇన్‌స్పెక్టర్...

“ మొహం చూశారా... ఎలా ఉందో! విషప్రయోగం జరిగిందేమో అనిపిస్తోంది.. కాకపోతే... మరణానికి ముందు ఆమె ఏదో చాలా బాధకు గురైనట్టుగా అనిపిస్తోంది.. .కానీ, హత్య ఎలా జరిగిందో పోస్ట్‌మార్టమ్‌లో తప్ప తెలుసుకొనే అవకాశంలేదు. ఎవరన్నా గొంతుపిసికి చంపారేమో అనడానికి గొంతుమీద ఎలాంటి గుర్తులు లేవు...కత్తిగాని, పిస్టల్‌గానీ ఉపయోగించారనడానికి ఒంటిమీద గాయాలూ లేవు....“

“ పోనీ... ఆత్మహత్య అయి ఉండచ్చా?“ సాలోచనగా అడిగాడు ఇన్‌స్పెక్టర్..

“ కావచ్చు..కాకపోతే రేప్ అటెంప్ట్ చేశారని కూడా అనుమానంగా ఉంది.. ఏది ఏమైనా, పోస్ట్‌మార్టం జరిగాకకానీ చెప్పలేం ...“

ఇన్‌స్పెక్టర్ చూపులు కొంచెం దూరంగా నిలబడిన పనివాళ్లవెప్పు తిరిగాయి.. అక్కడినుంచి సోఫాలో తలపట్టుకుని కూర్చున్న డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ తిలక్‌వెప్పు తిరిగాయి..

అందరిమొహాల్లోనూ దుఃఖం ...... కళ్లల్లో కన్నీటి ప్రవాహాలు... తిలక్ రెండుచేతుల్లో తలపట్టుకుని కుమిలిపోతున్నాడు... అతని తీరు చూస్తుంటే అతడిని పలకరించడానికి ఎవరికీ సాహసం కలగడంలేదు...

డాక్టర్ మాటలు విని షాక్ తగిలినవాడిలా తలెత్తిచూశాడు...“ హత్యా! శ్రే....శ్రేయని ఎవరు హత్యచేస్తారు? ఆమెకి శత్రువులెవరున్నారు... నో! నో...“ గట్టిగా అరవబోయాడు... కానీ, మూగబోయిన గుండెస్వరం శబ్దం రాకుండా గొంతుని నొక్కేసింది..అగ్నికణాల్లా ఉన్న కళ్లతో బిత్తరపోయి చూస్తూ కూర్చున్నాడు..

ఇంతలోకే బిలబిల్లాడుతూ పది, పదిహేను కార్లు కాంపౌండ్‌లో ఆగాయి.. బిలబిల్లాడుతూ తోటి నటీనటులు, డైరెక్టర్స్, టెక్నీషియన్స్ లోపలికి వచ్చారు...

విశాలమైన ఆ మె భవంతిలో అడుగడుగునా జనం ... సినీ పరిశ్రమ మొత్తం తరలి వచ్చింది..

శ్రేయని ఎవరో హత్యచేశారు... అన్న వార్తతో నగరం అట్టుడికిపోయింది... జనం ..జనం ...సినీమావారు, అభిమానులు, చుట్టుపక్కలవారు.... వాళ్లందర్నీ కంట్రోల్ చేయడం అక్కడ ఉన్న పోలీసులవల్లకాలేదు..... వైర్‌లెస్‌లో కంట్రోల్‌రూంకి సమాచారం

అందింది... కొంతసేపటికి మరోరెండు పోలీసు జీపులు వచ్చి ఆగాయి... జనాన్ని కంట్రోల్‌చేస్తూ, చెదరగొడుతూ హడావుడిచేశారు పోలీసులు.

వేలిముద్రల నిపుణులు సీరియస్‌గా వాళ్లపని వాళ్లు చేసుకుంటున్నారు.. . అందంగా, అమాయకంగా, ఉషోదయంలో విరిసిన తెల్లగులాబీలా ఉండే ఆ అందాల అభినేత్రి మొహం, ఎర్రగా కమిలిపోయింది... కళ్లచుట్టూ, పెదవుల దగ్గరా, చెంపలు అంతా ఎర్రగా ఎంతో బాధను ఓర్చుకుని, ఓర్చుకుని, నిస్సహాయంగా ప్రాణాలు విడిచినట్టు....

అప్పటిదాకా ఆమె మరణించిందన్న షాక్‌తో పిచ్చివాళ్లుగా మారిన పనివాళ్లు హత్య అని తెలియడంతో అయోమయంగా, భయంగా ఒక్కొక్కరే వచ్చి ఆమె మొహంలోకి పరీక్షగా చూసి వెళుతున్నారు... ఇప్పుడు అనిపిస్తోంది....ఖచ్చితంగా హత్యే అన్న విషయం.. కానీ ఎవరు హత్య చేశారు? అన్న ది తెలియడంలేదు.. ఆమె డెడ్‌బాడీ దగ్గరకు వస్తున్నవాళ్లని నిలబడనీయకుండా దూరం తోసేస్తున్నారు పోలీసులు.. నిత్యం ఆమెతో కలిసిఉండేవాళ్లు, ఆమెతో కలిసి పనిచేసే సినీ ప్రముఖులు అందరూ అక్కడే ఉన్నారు... వాళ్ల ందరి మొహాలు దుఖభారంతో నిండి ఉన్నాయి..

ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ ఇంటారాగేషన్ ప్రారంభించాడు...

ముందుగా సోఫాలో కూర్చుని అరచేతుల్లో మొహం దాచుకుని కుమిలి, కుమిలి ఏడుస్తున్న తిలక్ దగ్గరకు వచ్చాడు..

“మిస్టర్ తిలక్! “

ఇన్‌స్పెక్టర్ పిలుపుకి తిలక్ అరచేతులు కదిలాయి.. తలవంచుకుని కూర్చున్నాడు...

“విన్నారుకదా... శ్రేయగారు హత్యచేయబడ్డారు....“

“నేను ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను... తనని హత్యచేయాల్సిన అవసరం ఎవరికుంది ఇక్కడ? “

“అవసరం అనేది ఏ క్షణంలో ఎవరితో ఎలా కలుగుతుందో ఎవరు చెప్పగలరు?“

“ అంటే...“

“ మీరు మాకు కోపరేట్ చేస్తేగానీ మేము ఈ కేసు విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం ..“

“చెప్పండి నేనేం చేయమన్నా చేస్తాను... “ గాద్గదికంగా అన్నాడు..

“శ్రేయగారు చనిపోడానికి ముందు ఏ షూటింగులో పాల్గొన్నారు..“

“ కొత్త సినిమా...పేరు పెట్టలేదు....“

“ ఎవరి బ్యానర్...?“

“ మహితా ఫిలింస్‌వారిది..“

“ హీరో ఎవరు? విహార్‌గారా?“

“ కాదు... విహార్ వేరే షూటింగ్ నిమిత్తం ఊటీ వెళ్లాడు... కొత్త హీరో సిద్దార్థ“

“ అతనికి మొదటి పిక్చరా?“

“ అవును...“

“ శ్రేయగారు ఫీల్డుకొచ్చిన రెండేళ్లకి ఇదే మొదటిసారి అనుకుంటా వేరే బ్యానర్‌లో నటించింది..“

“ అవును...“

“ కానీ, వేరే బ్యానరు ఒప్పుకున్నందుకు మీరు అభ్యంతరపెట్టారని, ఆమెతో గొడవపడ్డారని విన్నాను...“

“ గొడవ పడిన మాట నిజమే...కానీ వేరే బ్యానర్ ఒప్పుకున్నందుకు కాదు.. సుప్రసిద్ధ హీరోయిన్ కొత్త హీరోతో వేస్తున్నందుకు మందలించాను... “

“ మీరెందుకు మందలించాల్సి వచ్చింది?“

“ ఆమె తల్లి, తండ్రులు నామీద నమ్మకంతో , శ్రేయ బాధ్యత నా మీద పెట్టారు... ఆమె శ్రేయస్సు చూడవలసినవాడిని... అందుకే కొన్ని విషయాల్లో నా సలహా పాటించమని వత్తిడి తెస్తాను.. అది ఆమె మీద కోపంతో కాదు.... ఆమె మంచికోసం ..“

“ మీరు ఆమెని పెళ్లి చేసుకోమని బలవంతం చేశారని విన్నాను...“

“నేనా! “ తిలక్ బాధగా చూశాడు... “ శ్రేయ ఎన్నోసార్లు పెళ్లిమాట తీసుకొచ్చినా , ఇప్పుడిప్పుడే పైకివస్తున్న నటివి..పెళ్లిచేసుకుంటే నీకు డిమాండ్ ఉండదు అని నేనే చెప్పాను... అలాంటిది నేనెందుకు బలవంతం చేస్తాను...పైగా ఆమెని నేను స్వంత చెల్లెలిలా చూసుకుంటున్నాను.. వాళ్లనాన్నగారు నాకు మంచి స్నేహితులు... గురుతుల్యులు... గురువుగారి కూతురు నాకు చెల్లెలు వరసవుతుంది కానీ, భార్యకాదుకదా!“

ఇన్‌స్పెక్టర్ ఈ మాటలకి తిలక్ కళ్లల్లోకి తీక్షణంగా చూశాడు... అతని కళ్లల్లో బాధ తప్ప ఏం కనిపించలేదు.. కళ్లు తడిగా ఉన్నాయి..

“ ఓ కె.... చూడండి ..ఈ కేసు ఫైనలైజ్ అయిందాకా మాకు తెలియకుండా మీరు ఎక్కడికీ వెళ్లకూడదు...“

“ హు... ఎక్కడికి వెళ్లగలను! ఎక్కడికీ వెళ్లను... హంతకుడు ఎవరో వాడిని ఉరికంబం ఎక్కించిందాకా నేను నిద్రపోను.. ....“

ఇన్‌స్పెక్టర్ శ్రేయ అకౌంటెంట్ నారాయణ దగ్గరకి నడిచాడు...

“ మీపేరు?“

“ నారాయణ.“

“ మీరిక్క డ ఏం చేస్తుంటారు?“

“ మేడమ్‌గారి అకౌంట్స్ చూస్తుంటాను... ఇన్‌కంటాక్స్ చూస్తుంటాను..“

“ ఎంతకాలమైంది మీరు ఈవిడ దగ్గర ఉద్యోగంలోచేరి“

" దాదాపు రెండు సంవత్సరాలు అవుతోంది.."

" అంతకు ముందు ఏం చేసేవారు?"

" ఎ జి ఆఫీసులో ఆడిటరుగా రిటైర్ అయాను..."

" మిమ్మల్ని శ్రేయగారికి పరిచయం చేసింది ఎవరు?"

" తిలక్‌గారు.."

" ఆయనెలా తెలుసు మీకు?"

" తిలక్ నా తమ్ముడి కొడుకు..."

" మీ తమ్ముడు వాళ్లు ఎక్కడుంటారు?"

" తిరుపతిలో అక్కడ నా తమ్ముడు ఎండోమెంట్స్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా చేస్తున్నాడు.."

" ఐసీ... శ్రేయగారిని మరణించడానికి ముందు మీరు ఎప్పుడు కలిశారు?"

" నిన్న ఉదయం పదిన్నరకు ఆవిడ నన్ను పిలిపించారు... బ్యాంకులో బాలన్స్ ఎంత ఉందని అడిగారు... "

" ఎంత ఉంది?"

" పది లక్షలు..."

" ఆ తరవాత"

" అమౌంట్ చెప్పగానే చాలా ఆశ్చర్యపోయారు... అంత తక్కువ ఉందేంటి? అని అడిగారు... ఆవిడ ఇచ్చిన చెక్కులతాలూకు వివరాలన్నీ చూపించాను... ఆవిడ ఏం మాట్లాడకుండా తొమ్మిది లక్షలకి చెక్కు రాసిచ్చి, డ్రా చేసుకురమ్మన్నారు... గంటలో ఆ డబ్బు తెచ్చి ఇచ్చాను.. అందులోంచి నాకు యాభైవేలిచ్చారు..."

" ఎందుకు?"

" మా అమ్మాయి పెళ్లి కుదిరిందని కట్నం ఇవ్వాల్సి రావడంచేత, అప్పు కావాలని అడిగాను..."

" మీరు మంచి ఉద్యోగం చేసి రిటైర్ అయారుకదా! మీకు డబ్బు ఇబ్బంది ఉంటుందా?"

" నాకు నలుగురు ఆడపిల్లలు...అందరి పెళ్లిళ్లు చేశాను... అందరికీ కట్నాలిచ్చాను... ఈ అమ్మాయి చివరి అమ్మాయి. ఈ పెళ్లి చేస్తే బాధ్యత తీరిపోతుంది.."

" ఐసీ... "

" శ్రేయగారికి ఆత్మహత్య చేసుకోవాల్సినంత సమస్య ఏం ఉందో మీకు తెలుసా ? "

నారాయణ పేలవంగా నవ్వాడు..." నాకేం తెలుస్తుంది ఇన్‌స్పెక్టర్‌గారూ! జీతం కోసం ఆవిడ దగ్గర పనిచేస్తున్నాను.. ఆమె వ్యక్తిగత విషయాలు నేనెందుకు తెలుసుకుంటాను? కోటీశ్వరుడి కూతురు, తాను స్వంతంగా కొన్ని లక్షలు సంపాదించుకుంది.. పేరు ప్రతిష్టలున్న ఆర్టిస్టు... చదువుకుంది... అందం ఉంది... చిన్న, చిన్న సమస్యలున్నా పరిష్కరించుకోగల సమర్థురాలు... అలాంటిది ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందంటే మాత్రం నమ్మలేకపోతున్నా ను."

" అంటే హత్య కావింపబడిందని అనుమానిస్తున్నారా?"

నారాయణ కొంచెం ఖంగారుగా అన్నాడు.." తెలియదు.. నాకేం తెలియదు..."

ఇన్‌స్పెక్టర్ అనుమానంగా ఆయన మొహం లోకి చూస్తూ అన్నాడు..." ఒకె... ఒకె.... చూడండి మీరు కూడా నాకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్లద్దు ఐమీన్... ఈ ఊరు దాటి..."

"అలాగే...." నారాయణ నీరసంగా, జీవరహితంగా నడుస్తూ హాలు బైటికి వెళ్లి నిలబడ్డాడు...

ఇన్‌స్పెక్టర్ పనికుర్రవాడు రాజుని దగ్గరకి పిలిచాడు.

" మీ అమ్మగార్ని చివరిగా ఎప్పుడు చూశావు?"

రాజు బావురుమని ఏడవటం ప్రారంభించాడు.... ఇన్‌స్పెక్టర్ ఎంతగా ఓదార్చడానికి ప్రయత్నించినా అతని ఏడుపు ఆపలేదు.. వెక్కి, వెక్కి ఏడుస్తూ... " అమ్మగారికి నేనే నా చేతుల్తో నూడుల్స్ తీసికెళ్లి పెట్టాను... నాకు అమ్మగారు కొత్త బట్టలు కొనుక్కోమని ఐదువేలు ఇచ్చారు.. అంత డబ్బు నాకెందుకు? అని వద్దన్నాను... కానీ వినకుండా నా జేబులో పెట్టి ...." మాట పూర్తి చేయకుండా వెక్కి, వెక్కి ఏడవసాగాడు...

అతడిని పూర్తిగా ఏడవనిచ్చి అడిగాడు ఇన్‌స్పెక్టర్...

" ఊ..... వినకుండా జేబులో పెట్టి ఏమన్నారు?"

రాజు వెక్కుతూ అన్నాడు..." నీకు చదువుకి కొంత డబ్బు ఫిక్సిడ్ చేస్తాను... చేశాక పాస్‌బుక్ ఇస్తాను... నేను వెళ్లిపోతున్నాను.. బాగా చదువుకో అని చెప్పారు..."

ఇన్‌స్పెక్టర్ భృకుటి ముడిపడింది... సాలోచనగా కానిస్టేబుల్ వెప్పు చూశాడు...

" అంటే! శ్రేయ ఏదో ప్లాన్ చేసుకుందనమాట..... సూయిసైడ్ చేసుకోవాలనుకుందా? లేకపోతే ఫీల్డునుంచి వెళ్లిపోవాలనుకుందా? లేక, పెళ్లిచేసుకోడానికి నిర్ణయించుకుందా? నారాయణకి డబ్బివ్వడం, బ్యాంకులో డబ్బంతా డ్రా చేయడం, రాజుకి కొంత డబ్బు ఫిక్స్ చేస్తాననడం దేనికి? ఇంకెవరికైనా ఇలాంటి వాగ్దానాలు చేసి, సెలవు తీసుకుని ఉంటుందా? ఆమె వెళ్లడం ఇష్టం లేని వాళ్లెవరైనా ఆమెని చంపారా?" ఇన్‌స్పెక్టర్‌కి ఏం అర్థం కాలేదు...శ్రేయ తల్లితండ్రులు వస్తేగానీ, కొంతన్నా సమాచారం దొరకదు...

అతని కళ్లముందు అన్ని రకాల వార్తాపత్రికలు కనిపిస్తున్నాయి.. చకచకా మీడియాకి ఈ వార్త వెళ్లిపోయింది...అన్ని ఛానెల్స్ ఫ్లాష్‌న్యూస్ తెలియచేశాయి... ఇంకా శ్రేయ తల్లి, తండ్రులు రాలేదు... వాళ్లు వస్తే కొన్ని విషయాలు తెలుస్తాయి.

మట మనిషి కమలమ్మ ని పిలిచాడు... ఆమె పూర్తిగా శోకదేవతలా ఉంది..మౌనంగా వచ్చి నిలబడింది..

"మీ పేరేంటమ్మా?"

"కమలమ్మ..."

"ఈ ఇంట్లో ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు?"

"దాదాపు రెండేళ్లనుంచీ.."

అంటే వీళ్లంతా శ్రేయతో బాటే ఇక్కడికి వచ్చారనమాట... తల పంకించాడు

" మీరావిడతో చివరిసారిగా ఎప్పుడు మాట్లాడారు?"

" నిన్న సాయంత్రం అమ్మగారు, ఆమెకి పి ఏ వందన కలిసి బెటైకి వెళ్లారు.."

" అప్పుడు సమయం ఎంత అయి ఉంటుంది?"

" ఏడు ఏడున్నర ...."

"ఆ తరవాత వాళ్లిద్దరూ ఎన్నింటికి వచ్చారు? "

" తెలియదు... నేను తొమ్మిదిన్నరకల్లా పడుకున్నాను...అప్పటిదాకా మాత్రం రాలేదు"

" అంత త్వరగా పడుకుంటారా మీరు?"

" నేను అన్నం తినగానే మాత్రలు వేసుకోవాలి.. అవి వేసుకుంటే నిద్ర వస్తుంది..అందుకు త్వరగా నిద్రపోతాను... నిద్రపోయేముందు అమ్మగారు ఇంట్లో ఉంటే ఆమెకేం కావాలో అడిగి పడుకుంటాను...

" వాళ్లిద్దరూ ఎక్కడికి వెళ్లారు? షూటింగ్‌కా?"

" తెలియదు... నేనడగలేదు... సాధారణంగా ఆ టైంలో షూటింగ్‌కి వెళ్లరు.... లేట్‌గా వస్తారుకానీ, ఇంటినుంచి మాత్రం ఆ టైంలో వెళ్లరు.."

" వందన ఎప్పుడూ శ్రేయగారితోటే ఉంటారా? "

" పదిహేను రోజుల క్రితం వందనకి ఏదో కష్టం వచ్చిందని, అమ్మగారు ఇంటికి తీసుకొచ్చారు..."

" వాళ్లిద్దరూ స్నేహింగా ఉండేవారా?"

" ఆ-- అమ్మగారు అందరితో స్నేహింగా, ఆప్యాయంగా ఉంటారు..."

" వెళ్లేటప్పుడు వాళ్లచేతిలో ఏదన్నా వస్తువు ఉందా? అంటే సూట్‌కేస్‌కానీ, బ్యాగుకానీ."

" లేదు...."

"ఆవిడ చనిపోయినట్టు మీకెలా తెలిసింది?"

" రాజు రోజూ ఉదయాన్నే ఆవిడకి టూత్‌బ్రష్, పేస్టు తీసికెళ్లి నిద్రలేపుతాడు... అది వాడిడ్యూటీ... ఈరోజు కూడా అలా వెళ్లినవాడు ఉన్నట్టుండి గావుకేక పెడుతూ కిందికి వచ్చాడు.... మేమంతా ఆ హడావుడికి పైకి వెళ్లి చూస్తే ఆమె ---ఆమె...." గాద్గదికం అయింది ఆవిడ స్వరం .

" మీరు చూసినప్పుడు ఆవిడ ఏ స్థితిలో ఉంది? అంటే ఒంటిమీద బట్టలు సరిగా ఉన్నాయా?"

" ఆ--- " పక్కకి ఒత్తిగిల్లి పడుకుంది..

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తల పంకించాడు..." ఓ కె మీరు వెళ్లండి..."

కమలమ్మ వెళ్లిపోయింది కళ్లు తుడుచుకుంటూ...

ప్రతాప్ ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు... ఇద్దరూ కలిసి ఎక్కడికెళ్లారు? ఎప్పుడు తిరిగి వచ్చారు? శ్రేయ చనిపోయింది..మరి వందన ఎక్కడికెళ్లింది? వందనని ఎక్కడికైనా పంపించిందా శ్రేయ? లేక వందనే శ్రేయని నమ్మించి డబ్బుకోసం, నగలకోసం ఆమెని చంపి పారిపోయిందా? డాక్టర్ అన్నట్టుగా ఆమె రేప్ చేయబడితే అంత పొందిగ్గా ఎలా పడుకుంటుంది?

చటుక్కున లేచాడు... రాజుని పిలిచి అడిగాడు...

" శ్రేయగారి బీరువా తాళం చేతులు ఎవరిదగ్గర ఉంటాయి?"

" ఆవిడ గదిలోనే ఉంటాయి.."

ఇన్‌స్పెక్టర్ వేగంగా మెట్లెక్కి శ్రేయ గదిలోకి వెళ్లాడు... గదంతా చాలా శుభ్రంగా, అందంగా ఉంది.... విశాలమైన బెడ్‌రూమ్.... ఓ పక్క డబల్‌కాట్ బెడ్.... నైలాన్ దోమతెర ... మరో పక్క డ్రెసింగ్ టేబిల్.... చక్కటి స్టాండ్స్.... వాటిమీద ఫ్లవర్‌వాజులు, ఒక చిన్న స్టాండ్ మీద టెలిఫోన్.... ఆమె మంచానికి ఆనుకుని ఉన్న బల్లమీద కార్డ్‌లెస్ ఫోన్, పుస్తకాల రాక్స్, సౌండ్‌సిస్టమ్.... గదిలో ఓ పక్క ఖరీదైన సోఫాసెట్టు, షోకేసుల్నిండా ఆమె నటించిన సినిమాల్లోని వివిధ వేషాల ఫోటోలు, ఆమెకి వచ్చిన అవార్డుల తాలూకు మెమెంటోలు...ఆమె అభిరుచికి అద్దం పడుతోంది గది... ఇన్‌స్పెక్టర్ గుమ్మంలో నిలబడే గదంతా ఓసారి పరికించాడు..
మంచం మీద బెడ్‌షీట్ అస్తవ్యస్తంగా ఉంది...

తన వెనకాలే వచ్చి నిలబడిన కానిస్టేబుల్ వైపు చూసి, " తాళం చేతులు వెతకండి. ..." అన్నాడు...

కానిస్టేబుల్ మంచం మీద, మంచానికి ఆనుకుని ఉన్న రాక్స్‌లో, టెలిఫోన్ స్టాండ్ వద్దా వెతికాడు... తాళంచేతులు కనిపించలేదు..

యాధాలాపంగా బీరువావైపు చూసిన ఇన్‌స్పెక్టర్ ఉలిక్కిపడ్డాడు... బీరువా కొద్దిగా తీసి ఉంది... చటుక్కున బీరువా దగ్గరకి నడిచాడు.. లోపలంతా ఖాళీగా ఉంది... కొన్ని సాదా చీరలు తప్ప ఏమీ లేవు... డబ్బు, నగలు, చెక్కుబుక్కు ఏమీ కనిపించలేదు.. లాకర్స్ ఖాళీగా ఉన్నాయి..

తిరిగి కిందికి వచ్చాడు... వేలిముద్రల నిపుణులను తీసుకుని పైకి వెళ్లాడు... బీరువా మీద, మంచం మీద, అక్కడ ఉన్న అన్ని వస్తువులమీదా ఫింగర్‌ప్రింట్స్ తీయించాడు..... వేలి ముద్రల నిపుణులు తమ పని ముగించి వెళ్లిపోయారు... ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ నారాయణని పిలిచాడు...

ఆయన మళ్లీ తననెందుకు పిలుస్తున్నాడో అర్థంకాక, భయం, భయంగా వచ్చి నిలుచున్నాడు..

" శ్రేయగారికి బ్యాంకు లాకర్లు లేవా? "

" రెండు లాకర్లున్నాయి..."

" తాళం చేతులు ఎవరిదగ్గరున్నాయి?"

" ఆమె దగ్గరే ఉండేవి..."

" క్రెడిట్ కార్డులేమన్నా వాడేవారా?"

" లేదు.... "

" సరే...." ఇన్‌స్పెక్టర్ కి అనుమానం తీరినట్టనిపించింది...వందన శ్రేయని హత్యచేసి, ఏ అర్ధరాత్రో డబ్బు, నగలు తీసుకుని పారిపోయింది.. ఎక్కడికి వెళ్లి ఉంటుంది? అసలామె ఎక్కడినుంచి వచ్చింది? ఆమె తల్లి, తండ్రులెవరు, వివాహితురాలా? కాదా? ఈ విషయాలన్ని తెలియాలంటే ఫీల్డులో వాళ్లని అడగాలి...

అతనికి పిచ్చి పట్టినట్టుగా ఉంది... అతి తక్కువ కాలంలో ఎంతో పైకి వచ్చి, నెంబర్ వన్‌గా వెలిగిపోతున్న శ్రేయ మరణం అతనిని కూడా కదిలించింది.. ఆమె అభిమానుల్లో అతనూ ఒకడు... శ్రేయది సహజ సౌందర్యం .. ప్రతి సినిమాలో కూడా ఎక్కువ మేకప్ లేకుండా సహజంగా నటిస్తుంది.. ఎంత మంచిపేరుంది ఆ అమ్మాయికి? ఏమిటీ ఖర్మ? పెద్ద బిజినెస్ మాగ్నెట్ కూతురని చెప్పుకుంటారు.. ఏదో సినిమాల మీద ఉన్న ఆసక్తితో ఈ ఫీల్డుకి వచ్చిందికానీ, డబ్బుకోసం కాదు అని కూడా విన్నాడు తను... పాపం! ఎలాంటి చావు వచ్చింది? ఎంతో పైకి రావాల్సిన నటి..మహానటి సావిత్రిని, మీనాకుమారిలను మరిపించే అభినయ కౌశలం ఉందామెకి.. ప్రతాప్ చేతి వాచీ చూసుకున్నాడు....

"వీళ్లింకా రాలేదేంటి?" సోఫాలోంచి లేచి బైట కారిడార్‌వైపు నడిచాడు... అతనికి అస్థిమితంగా ఉంది..కూతురు చనిపోయిందని తెలియగానే రెక్కలు కట్టుకు వాలవలసిన తల్లి, తండ్రులు కబురు తెలిసిన ఇంతసేపటికి కూడా రాకపోవడంలో అర్థం ఏమిటి?

అతని పోలీసుబుర్ర వాళ్లను అనుమానించడానిక్కూడా వెనుకాడలేదు.

కోటీశ్వరుడైన కృష్ణమోహన్ వెంటనే బయలుదేరినా ఫ్లైట్ ఈ పాటికి వచ్చేసి ఉండాలి.. ఫ్లైట్‌లో బయలుదేరలేదా? అదికాకపోతే మరోటి సాయంత్రం దాకాలేదు...అలా అయితే, సాయంత్రానిక్కానీ రారు వాళ్లు... అప్పటి వరకూ ఈ డెడ్ బాడీ ఇక్కడెలా ఉంచడం!

సినీ ఫీల్డులో ఉన్న వారంతా వస్తున్నారు... చూస్తున్నారు ... వెళ్తున్నారు... వారు తెచ్చి న పూలదండలతో డెడ్‌బాడీ పూర్తిగా కప్పుకుపోయింది. అగరుబత్తులు ఓ విషాదకరమైన వాసనని వెదజల్లుతున్నాయి.. అతనికెందుకో ఆ వాసన నచ్చలేదు..
దేవుడి దగ్గర వెలిగిస్తే ఎంతో మంచి పరిమళం వస్తుంది.. మరి శవం దగ్గర వెలిగించిన అగరుబత్తుల పరిమళం ఇలా ఉంటుందేం? అగరుబత్తుల్లో తేడా ఉండదుకదా!

ఇంతలో

తళతళలాడే బెంజికారు ఆవరణలోకి దూసుకొచ్చింది.. అందులోంచి దూకినట్టుగా దిగింది యశోద..... ఆమె వెనకే కృష్ణమోహన్ దిగాడు... యశోద పరుగులాంటి నడకతో మెట్లెక్కి లోపలి కి వచ్చింది..వస్తూనే ఆమె ఏడుస్తూ పరిగెత్తుకుంటూ శ్రేయ శవం దగ్గరకు వచ్చింది..

" నా తల్లీ ! ఎంత పని జరిగిందే... ఇన్‌స్పెక్టర్ నా బిడ్డని ఎవరు చంపారు? అందరికీ ఉపకారం తప్ప అపకారం అంటూ ఎరుగని నా చిట్టితల్లి ఎవరికి శత్రువైంది.. ఎవరు చంపారు? ఎందుకు చంపారు? " అంటూ పిచ్చి, పిచ్చిగా అరుస్తూ పూల దండలన్నీ లాగిపడేయసాగింది..

కృష్ణమోహన్ తనలోతాను కుమిలిపోతూ నిలబడ్డాడు...

వాళ్లని చూడగానే తిలక్ వడి,వడిగా వచ్చి కృష్ణమోహన్‌ని పట్టుకుని బావురుమన్నాడు...

" మీకోసమే ఎదురుచూస్తున్నాను సార్... బాడీని పోస్ట్‌మార్టమ్‌కి పంపించాలి.." అన్నాడు ఇన్‌స్పెక్టర్...

" నో! నో! నా బిడ్డని ముక్కలు చేయద్దు..... ఆత్మహత్య అయినా, హత్య అయినా నా బిడ్డ ఇంకలేదు... అంతే...ఈ రెండిటిలో ఏది నిజమైనా ఆ నిజం జీర్ణించుకుని బతికే శక్తి నాకు లేదు... నేను ఎంతకాలం బతుకుతానో నాకే తెలియదు.... ఏదీ శాశ్వతం కాదు ఇన్‌స్పెక్టర్ .. నా బిడ్డ సుఖం, నా బిడ్డ ఆనందం, ఏదీ శాశ్వతం కానప్పుడు ఈ ప్రపంచంలో ఇంకేదీ శాశ్వతం కాదు... నాకూతురు శవాన్ని నాకివ్వండి... తీసికెళ్లిపోడానికే వచ్చాను.. నాకీ వార్త తెలిసేటప్పటికి తిరుపతిలో ఉన్నాం ...అందుకే లేట్ అయింది.. "

" అదికాదు సర్..." ఇన్‌స్పెక్టర్ ఏదో అనబోయేంతలో యశోద కెవ్వుమని అరిచింది...

అందరూ ఉలిక్కిపడి, ఆమె దగ్గరకి పరిగెత్తారు....యశోద శ్రేయ మొహం చేతుల్లో పట్టుకుని ఉంది....

కృష్ణమోహన్  వంగి ఆమె బుజం మీద చేయి వేసాడు.. " యశోదా! రిలాక్స్.... రిలాక్స్ అవు... "

యశోద వెర్రిదానిలా చూస్తు అన్నది.."  ఈ శవం శ్రేయదికాదు...."

కొన్ని క్షణాలపాటు అక్కడ సూది కిందపడినా వినిపించేంత నిశ్శబ్దం ఏర్పడింది...

కృష్ణ మోహన్ స్థాణువులా నిలబడిపోయాడు... తిలక్ వెర్రివాడిలా పదే, పదే శవం మొహం చూస్తూ పిచ్చివాడిలా నిలబడిపోయాడు...

ఇన్‌స్పెక్టర్‌కి మెదడంతా బ్లాంక్ అయిపోయింది...

యశోద చటుక్కున లేచి నిలబడింది.... " అవును ఈ శవం నా శ్రేయది కాదు... నా శ్రేయ బతికే ఉంది.... ఎక్కడుంది? చెప్పండి ఎక్కడుంది?"  ఉన్మాదినిలా అరుస్తూ, తిలక్ షర్టు  పట్టుకుని ఊపసాగింది..

కృష్ణ మోహన్ ఆమెని వారించడానికి విశ్వ ప్రయత్నం చేయసాగాడు...

ఒక్కొక్కరే వచ్చి శవాన్ని పరీక్షగా చూడసాగారు... శవం మీద ఉన్న దుస్తులు శ్రేయవి... హెయిర్ స్టైల్, పొడుగు, లావు అంతా శ్రేయ... చేతులు, కాళ్లు, చేతికున్న గాజులు, కాళ్లకున్న పట్టాగొలుసులు, అన్నీ శ్రేయే అని తెలియచేస్తున్నాయి..మొహం కొద్దిగా కమిలిపోయి ఉన్నా శ్రేయ పోలికలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి... శ్రేయ కాకపోవడం ఏంటి?  ఈవిడకి పిచ్చిపట్టిందా? కూతురు మరణించిందన్న వాస్తవం జీర్ణించుకోలేక ఇలా భ్రమ పడుతోందా? అందరూ యశోద వైపు జాలిగా చూశారు...

కృష్ణమోహన్ భార్య స్థితికి బాధపడుతూ ఆమెని ఓదార్పుగా లేవనెత్తి,  " రిలాక్స్ అవు యశోదా..."  అన్నాడు...వెంట్రుకలు సవరిస్తూ..

" కాదండీ... ఈ శవం శ్రేయది కాదు... నేను దాని తల్లిని .. నాకూతుర్ని నేను గుర్తు పట్టలేనా? నాకు తెలుసు... ఎంత మాత్రం శ్రేయదికాదు... ఎవరో శ్రేయని కిడ్నాప్ చేశారు... అది చచ్చిపోయిందని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు... ఈ అమ్మాయి ఎవరో, ఎక్కడ్నించి తెచ్చారో.... నా కూతురు నాకు కావాలి.. నా శ్రేయ నాక్కావాలి.. ఇన్‌స్పెక్టర్ వెతికించండి.. నా కూతురు ఎక్కడుందో వెతికించండి. ఎంత డబ్బైనా ఫరవాలేదు... వెతికించండి..."

తిలక్ ఆమెనుంచి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ... యశోదని గట్టిగా పట్టుకుని, " మేడమ్! ప్లీజ్... నా మాట వినండీ.." అంటూ పిలవసాగాడు...

అతడి స్వరం వినగానే యశోద బాగా రెచ్చిపోయి అరవసాగింది. " దుర్మార్గుడా.... నా బిడ్డ బతుకు ఇట్లా నాశనం చేయడానికేనా, సినిమాలు, సినిమాలు అంటూ ప్రలోభపెట్టి తీసుకెళ్లావు... చూడరా.. నా బిడ్డ బతుకేమైందో చూడు... వెళ్లరా నా కూతురు ఎక్కడుందో వెతుక్కురా... లేకపోతే నిన్ను చంపేస్తాను..."  ఆ అరుపులకి, ఏడుపుకి అందరూ మ్రాన్పడి చూడసాగారు... తిలక్ మొహం కత్తివాటుకి నెత్తురుచుక్కలేనట్టు పాలిపోయింది. నిస్సహాయంగా కృష్ణ మోహన్ వైపు చూశాడు...

" యశోదా! ప్లీజ్.... కంట్రోల్ యువర్‌సెల్ఫ్... మనసు గట్టి చేసుకో... "  ఆమెని దగ్గరకు పొదుపుకుని ఓదార్చసాగాడు కృ ష్ణమోహన్..

యశోద  ఆయన గుండెల మీద వాలిపోయి ఏడుస్తూ, అదేపనిగా, ఆ శవం శ్రేయది కాదని, శ్రేయ చచ్చిపోలేదని అరవసాగింది.. అరిచి, అరిచి కొంతసేపటికి సొమ్మసిల్లినట్టుగా  కూర్చుండిపోయింది.

పాపం! ఈవిడ మెంటల్‌గా బాగా దెబ్బతిన్నది... ఒక్కగానొక్క కూతురు ఇలా అర్ధాంతరంగా చనిపోవడం ఏ తల్లిమాత్రం తట్టుకోగలదు!

కృష్ణమోహన్ స్వరం దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ బొంగురుగా వినిపిస్తోంది... అమ్మాయిని తను చూసి చాలా రోజులైంది కదా! మేకప్ చేసుకుంటుంటే కూడా మొహంలో మార్పొస్తుంది... అంతకు తప్ప మరేంలేదు...అంటున్నాడాయన తిలక్‌తో..

నో! గట్టిగా అరిచింది యశోద ...నో! ఎంతమాత్రం నా కూతురుకాదు....

అప్పటిదాకా యశోదవైపు జాలిగా చూస్తో న్న ఇన్‌స్పెక్టర్ ఆమెఅరుపుకి బిత్తరపోయి చూశాడు.. అంత ఖచ్చితంగా చెబుతోంటే ఆలోచించకుండా ఉండలేకపోయాడు... ఈ డెడ్‌బాడీ శ్రేయదికాదా? మరి ఎవరిది? కొంపదీసి వందన కాదుకదా! కమలమ్మని పిలిచాడు...

ఆవిడ భయంగా వచ్చింది..

ఈ మొహం సరిగా, పరీక్షగా చూడు...."  శ్రేయగారేనా?

ఆవిడ క్షణం కూడా ఆలస్యం చేయకుండా చెప్పింది.."  శ్రేయగారే ! "

" ఎలా చెప్పగలరు ఖచ్చితంగా..."

" వందనది  చాలా పెద్ద జడ.... శ్రేయది  పొట్టి జడ... ఉంగరాలు తిరిగిఉంటుంది.. చూడండి కావాలంటే.. పైగా వందన మొహం మీద స్ఫోటకం మచ్చలుంటాయి.."

కమలమ్మ కింద కూర్చుని, శవం తల ఎత్తి జడ ఎత్తి పట్టుకుని చూపించింది..నిజంగానే పొట్టిజడ....

మొహం మీద స్ఫోటకం మచ్చలు లేవు..

తలపంకించాడు... యశోద దగ్గరగా నడిచి అడిగాడు..." మేడమ్! ఐడింటిఫికేషన్ మార్క్స్ ఏమన్నా చెప్పగలరా?"

" యస్ చెప్పగలను.... లెఫ్ట్ బ్రెస్ట్‌మీద కందిబద్దంత పుట్టుమచ్చ ఉంటుంది.."

" ఓ కె... అందరం బైటికి వెడతాం .... పుట్టుమచ్చ ఉందో! లేదో  చూసి చెప్పండి..."

అంటూ అక్కడ ఉన్న అందరివైపు చూశాడు… అతని చూపు అర్థం చేసుకున్నవాళ్లందరూ బైటికి నడిచారు…. యశోద తలుపేసింది…

బైట కృష్ణమోహన్ టెన్షన్ కంట్రోల్ చేసుకుంటూ, నిలబడ్డాడు…. అందరి మొహాల్లో టెన్షన్…..

నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి….

ఆత్రంగా అడిగాడు ఇన్స్పెక్టర్…..'' ఉందా?''

యశోద కొంచెం నెమ్మదిగా …'' ఉంది.'' ..అని, తరవాత ధృడంగా అన్నది..'' కానీ, నేను మాత్రం నమ్మను…. నా కూతురు ఎంతమాత్రం కాదు….''

''పుట్టుమచ్చ ఉందా? '' ఆత్రంగా అడిగాడు కృష్ణమోహన్…

'' ఉంది…. అయినా, ఈ ప్రపంచంలో ఇంకెవరికీ అలాంటి పుట్టుమచ్చ ఉండదని ఎలా అనుకోడం? మచ్చల సంగతెలా ఉన్నా, తల్లిగా స్పర్శతో చెప్పగలను… ఈ బాడీ నా కూతురు శ్రేయదికాదు….కాదు…నా కూతుర్ని ఎవరో కిడ్నాప్ చేశారు…. చెప్పండి ఎవరు చేశారో…. ఎందుకుచేశారో…. ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను…. నా ఆస్తి మొత్తం రాసిస్తాను… నా కూతుర్ని తెచ్చివ్వండి.. తెచ్చివ్వండి.'' హిస్టీరిక్‌గా ఏడవసాగింది..

''యశోదా! రిలాక్స్…. ''

'' కృష్ణమోహన్‌గారూ! పోస్ట్ మార్టమ్ అయితేగానీ ఏమీ చెప్పలేము.'' ఇన్స్పెక్టర్ ఖచ్చితంగా అన్నాడు.

కృష్ణమోహన్.. మాట్లాడలేదు… యశోద ఏడుస్తూనే ఉంది..'' నాకూతుర్ని వెతకండి.. నాకూతురు కావాలి…'' అంటూ అరుస్తోంది మధ్య, మధ్య. .

దాదాపు రెండుగంటల తరవాత అంబులెన్స్ వచ్చింది..

డెడ్‌బాడీని హాస్పిటల్‌కి తీసికెళ్లారు… ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్స్‌తోపాటు తిలక్‌కూడా వెళ్లిపోయాడు..

కమలమ్మ చల్లటి నీళ్లు తీసుకొచ్చి యశోద మొహం మీద చల్లింది… బలవంతంగా ఆమెచేత నీళ్లు తాగించింది..

శ్రేయ డెడ్‌బాడీ మీద ఉన్న బట్టలు డి ఎన్ ఏ పరీక్షలకి పంపించారు… వేలిముద్రల నిపుణుల రిపోర్ట్సులో శవం వంటిమీద, నడుం మీద ఒక పురుషుడి వేలిముద్రలున్నాయి.. అయితే అవి అక్కడవాళ్లకి సంబంధించిన ఎవరి వేలిముద్రలతో సరిపోలేదు… ''

మరణించింది శ్రేయ కాదు అన్న యశోద మాటలు నమ్మబోయే ముందు కేసు క్లిష్టంగా మారింది..

ఏది ఏమైనా మరణించింది శ్రేయ అయినా, వందన అయినా, హత్య చేసింది ఒక పురుషుడు అన్నది మాత్రం వాస్తవంగా తేలింది..

ఒకవేళ శ్రేయ అయితే, ఎవరు చంపారు? ఎందుకు చంపారు? ఎవరన్నా రేప్ చేసి చంపారా? అయితే ఎవరు? తిలకా? హీరో విహారా? కాదు… అతనసలు ఊళ్లోనే లేడు… కొత్తహీరోనా? అతను సినిమా మీద ఆసక్తితో , ఉత్సాహంగా వచ్చిన కొత్త కుర్రాడు… పాపం అతనికేం తెలియదని తేలింది..నిర్మాతలా, కెమెరామానా? ఇంట్లో ఉన్న నారాయణా…. రాజా? తోటమాలి చిన్నయ్యా? .. ఎవరు? ఇంకెవరు? ఇన్స్పెక్టర్ ప్రతాప్‌కి ఈ కేసు చాలా జటిలంగా తయారైంది. నిజంగా మరణించింది శ్రేయకాకపోతే, ఆమె ఏమైంది? యశోదన్నట్టు ఎవరన్నా కిడ్నాప్ చేశారా?

హత్య కావింపబడింది శ్రేయ అయితే, హత్య చేయడానికి అసూయకాని, ప్రేమకానీ అయి ఉండాలి… ఎవరికి ఆమె అంటే అసూయ… తిలక్‌కా? తిలక్‌కి అసూయ కలిగే ఆస్కారం లేదు… బహుశా అతను శ్రేయని ప్రేమించి ఉంటాడా? ఆమె పెళ్లికి ఒప్పుకోలేదా? తాను ఆమెని చెల్లెల్లా చూస్తున్నానని చెప్పాడే…ఒకవేళ వందనే హత్య చేసి, నగలు, డబ్బు తీసుకొని వెళ్లి ఉంటుందా? వందనకీ, శ్రేయకీ ఏదన్నా భేదాభిప్రాయాలు వచ్చి, శ్రేయే వందనని హత్య చేసి పారిపోయిందా? నో! శ్రేయకి అంత సాహసం ఉండదు… ఎంతో నాజూకుగా, జాజిపూవులా కనిపించే శ్రేయ హంతకురాలు కాగలదా? ఇంకెవరైనా డబ్బు కోసం హత్య చేసి ఉంటే, డబ్బు, నగలు తీసికెళ్తారు… చెక్కుబుక్కు తీసికెళ్లి ఏం చేస్తారు? ఫోర్జరీ చేసి డబ్బు డ్రాచేయచ్చనా? ఆ అవకాశం ఎవరికి ఉంది? ఉంటే తిలక్‌కి,…. లేదంటే నారాయణకి..మిగతావారికి ఆమె ఫైనాన్సియల్ మాటర్‌తో సంబంధంలేదు… ప్రతాప్‌కి పిచ్చెక్కినట్టుగా ఉంది..

రోజూలాగే మళ్లీ మామూలుగా తెల్లవారింది…ప్రతి ఇంటిగుమ్మం ముందూ వార్తాపత్రికలు తెల్లవారకముందే పడ్డాయి… పెద్ద, పెద్ద అక్షరాలతో శ్రేయ మరణవార్త, కథలు, కథలుగా వర్ణించి, రాశారు… అది వార్త చదువుతున్నట్టుగా లేదు…. ఓ సస్పెన్స్, క్రైమ్ స్టోరీ చదువుతున్నట్టుగా అనిపిస్తోంది అందరికీ… ముఖ్యంగా 'మరణించింది తన కూతురుకాదంటూ గోలచేసిన తల్లి''' అనే హెడ్డింగ్‌తో రాసిన వార్త మరీ ఆకర్షించింది… కూతురి హటాన్మరణంతో మానసికంగా దెబ్బతిన్న శ్రేయతల్లి యశోద ఆ శవం తన కూతురిది కాదని, మరణించింది మరెవరో అని, తన కూతురు ఎక్కడో క్షేమంగా ఉందని గుండెలు పగిలేలా ఏడుస్తూంటే చూసేవారి హృదయం తరుక్కుపోయింది…

మీనంబాకంలోని ఓ బ్యూటీపార్లర్ అప్పుడే తెరిచి, కిందపడిన న్యూస్‌పేపర్ తీసుకుని, సోఫాలో వాలింది అనన్య…స్వీపర్ వచ్చి, టేబిల్స్, కుర్చీలు,, అద్దం తుడుస్తూంది… అనన్య పేపర్ చదవడంలో లీనమై హటాత్తుగా ఉలిక్కిపడింది… మరోసారి శ్రేయ మరణవార్తని అన్ని కోణాల్లో చదివింది… ముఖ్యంగా యశోద గురించిన వార్త చదివిన ఆమె మొహం ఎర్రబడింది…

శ్రేయ చనిపోయిందా? నో! తన దగ్గర్నించి వెళ్లిపోయి 24 గంటలు కూడా గడవకముందే శ్రేయ చనిపోవడం …ఎలా?

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Amavasya+Tara**

* * *